
■ ఎలక్ట్రాన్




# గొలుసు కంచెలు

అది అస్తవ్యస్తంగా పెరుగుతున్న పట్టణం. ఆ పట్నానికి నైరుతి దిశలో ఓ పెద్ద చెరువుంది. ఓ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆ చెరువుని దత్తత తీసుకొని, అభివృద్ధి కార్యక్రమాలు చేబట్టి అందంగా తీర్చిదిద్దింది. ఆ చెరువుకి ఈశాన్యంలో ఓ పెద్ద రావి చెట్టుంది. ఆ రావి చెట్టుకింద కూర్చోడానికి అనువుగా ఓ డజనుకి పైగా, ఇనప చట్రాలతో చేసిన అందమైన నగిషీ బెంచీలు సప్తవర్ణాలతో చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. అయితే స్థానిక బలంకల కొందరు పెద్దలు ఆ చెరువు అలాంటి సొగసులు దిద్దుకోవడానికి తామే కారణమంటారు. వివిధ రాజకీయ పార్టీల ప్రసంగాల్లో ఆ చెరువు పేరు మాటిమాటికీ వినవస్తుంది.

అంబాజీపేటలో పనిచేస్తున్న తారక్, అమలాపురంలో పనిచేస్తున్న వేణు ఆ పట్నంలో పక్కపక్క యిళ్ళవాళ్ళు. 'నీ పొరుగు వాడెప్పుడూ నీకు శత్రువుగానే ఉంటాడ'న్న చక్రవర్తుల రాజగోపాలాచారి గారి ఉవాచకి విరుద్ధంగా తారక్, వేణులిద్దరూ మరీ అంత ప్రాణ స్నేహితులు కాకపోయినా స్నేహంగానే ఉంటారు. సెలవుమీద ఊరొచ్చిన వాళ్ళిద్దరూ ఓరోజు సాయంత్రం ఆ రావిచెట్టు కిందనున్న ఎర్ర బెంచీమీద కూర్చుని కబుర్లాడుకొంటున్నారు.

''ఏవిటో అదృష్టం కలిసిరావటల్లేదు. ఎంత కష్టపడి పన్జేసినా ఈ మాటూ నా ప్రమోషన్ కొండెక్కిపోయింది! పన్జేసీ ప్రయోజనం లేదు!'' అన్నాడు తారక్.

''సిఫారసుల తతంగం మన సమాజంలో వేళ్ళతో పాతుకుపోయింది. అందుకని సామర్థ్యమనే దానికి విలువేకాదు, నిర్వచనంకూడా మారిపోయింది. ఒకవేళ నీ సామర్థ్యం ఆధారంగా జీవితంలో ఎన్ని విజయసోపానాలు అధిరోహించినా, 'అదృష్టవంతుడు, పైకి వచ్చాడు!' అనుకొంటారే తప్ప, సామర్థ్యంవల్ల పైకి వచ్చావని ఎవరూ అనుకోరు! అందుకనే ఈ అదృష్టమనే పదానికి నిర్వచనమూ కష్టమే, దాన్ని అర్థం చేసుకోవడమూ కష్టమే! అసలు అదృష్టమనే పదానికి అర్థంలేదు!'' అన్నాడు వేణు.

''ఎందుకు లేదు? నేనెంత కష్టపడి పన్జేసినా ఫలితం లేదు. అది మరి నా దురదృష్టం వల్లనే కదా?'' అన్నాడు తారక్.

''ఒక్క కష్టపడి పన్జేస్తేనే చాలదు. నువ్వు కష్టపడి పన్జేస్తున్నట్లు నీపై వాళ్ళు గుర్తించేటట్లు చెయ్యగల నేర్పు కూడా ఉండాలి! సరే, ఓ చిన్న ప్రశ్న అడుగుతాను, సమాధానం చెప్పు'' అన్నాడు వేణు.

''అలాగే అడుగు'' అన్నాడు తారక్.

''ఓ వ్యక్తి రోడ్డుమీద వెడ్తున్నాడు. అతగాడికి రోడ్డుమధ్యలో ఓ వంద రూపాయల నోటు దొరుకుతుంది. అతగాడికి అదృష్టం ఉండడంవల్ల ఆ నోటు దొరికిందంటావా, లేక నోటు దొరకడంవల్ల అదృష్టవంతు డయ్యాడంటావా?''

''అదృష్టం ఉండడంవల్లే దొరికిందంటాను. లేకపోతే అనేకమంది నడిచే రోడ్డుమీద ఆ వ్యక్తికే నోటెందుకు దొరకాలి?''

''మిగిలిన వాళ్ళందరూ పని తొందర్లలో పోతూంటే, అతనొక్కడే దారినీ, పరిసరాల్నీ గమనిస్తూ వెళ్ళడం మూలాన దొరికిందని ఎందుకనుకోకూడదు? అదే విధంగా ఆ నోటు పారేసుకొన్నవాడు తన నిర్లక్ష్యం మూలాన దాన్ని పారవేసుకొన్నాడనుకోవచ్చుగా? అందుచేత నోటు పారవేసుకొన్నవాడు దురదృష్టవంతుడూ, దొరికినవాడు అదృష్టవంతుడూ అవడమనేది ఆ సంఘటనల తర్వాత అన్వయించుకోవాలే గాని, ముందుగా మట్టుకు కాదు. ప్రతిదానికీ అదృష్టం అనే దాని మీదనే నమ్మకం పెంచుకొంటే, పనిచేస్తున్న నీలాంటి వాళ్ళు నీరసపడిపోగా, చాలామంది అసలు ప్రయత్నమనేదే చెయ్యరు!'' అన్నాడు వేణు.

ఉన్నట్టుండి వాళ్ళిద్దరూ ఒకేసారి బెంచీకి కాస్తదూరంలో ఉన్న కాలి బాట పక్కన పడి ఉన్న నోట్లకట్టని చూశారు. ఇద్దరూ ఒక్క గెంతుగెంతి ఆ నోట్లకట్టమీద పడ్డారు. 'నేను ముందు చూశానంటే నేను ముందుచూశానని, నాదంటే నాదనీ'వాదులాడుకోసాగారు. జనాలు పోగయి వినోదంగా చూస్తోంటే జగడం తీవ్రరూపం దాల్చింది. చెరువుగట్టు రోడ్డుమీదుగా పోతున్న జీపునాపి, పోలీస్ సబ్ఇన్‌స్పెక్టరు కనకారావు ఆ గుంపుని చేరాడు. జరిగిన సంగతి కొంత జనం ద్వారానూ, మరికొంత వారిద్దరి ద్వారా తెలుసుకొని, ఇద్దర్నీ తీసుకొనిపోయి పోలీసుస్టేషన్లో తాత్కాలిక నిర్బంధంలో ఉంచాడు.

అదే సమయంలో తన పోలీసు మిత్రుడు కనకారావుని కల్సుకోవాలని వచ్చిన ఓ బాంక్ కేషియర్ 'ధనంజయ్' ఆ నోట్లకట్టని చూసి అవి దొంగనోట్లన్నాడు.

తారక్, వేణులను కనకారావు కొంతసేపు ప్రశ్నించి, ''జన సాక్ష్యం ఉంది కాబట్టి సరిపోయింది కాని, లేకపోతే దొంగ నోట్ల కేసులో ఇరుక్కొని పోయేవారు. ఒక విధంగా మీరు దెబ్బలాడుకోవడమే నయమైంది! చెరి సగం పంచుకొని ఉంటే నకిలీ నోట్లతో త్వరలోనే పట్టుబడిపోయేవారు. ఇక ముందర నోట్లకట్టలూ, పార్కు బెంచీలమీద వదిలేసిన సంచులూ కనబడితే పోలీసుస్టేషన్‌కి వచ్చి రిపోర్ట్ చెయ్యండి. ఎందుకంటే ఆ నోట్లు నకిలీవీ కావొచ్చు. ఆ సంచుల్లో బాంబులూ ఉండొచ్చు! అయిన పక్షంలో కూపీలు లాగడానికీ, కాని పక్షంలో స్వంతదారులకు అందచెయ్యడానికీ పోలీసులు ప్రయత్నిస్తారు. చదువుకొన్నవారు- పౌరులుగా మీ విధి మీరు నిర్వహించాలి!'' అని క్లాసు పీకి వదిలేశాడు.

బ్రతుకు జీవుడా అనుకొంటూ తారక్, వేణులిద్దరూ బయటపడ్డారు. కొంతసేపటివరకూ ఒకరి మొహంలోకి మరొకరు చూసుకోవడానికి సిగ్గుపడ్డారు.

తారక్ అన్నాడు. ''స్వార్థం మనిద్దరిచేతా ఘర్షణపడేటట్లు చేసింది. అదే మన అదృష్టమై నకిలీ నోట్ల కేసులో

ఇరుక్కోకుండా చేసింది. ఇనస్పెక్టరు మాటలు నిజమే!''

''అదృష్ట దురదృష్టాల మేరకు నాకిప్పుడు నీ మాటల మీద కొంత నమ్మకం ఏర్పడక తప్పటల్లేదు. కానైతే, అవి నకిలీ నోట్లు కాని పక్షంలో పోలీసులు వాటిని స్వంతదారుల కందించే ప్రయత్నమే చేస్తారో, స్వంత దారుల్లోకి మళ్ళించడం చేస్తారో ఆయా అధికారుల మనస్తత్వం మీద ఆధారపడి ఉంటుంది!''అన్నాడు వేణు వేదాంత ధోరణిలో. వాళ్ళిద్దరూ బయటకి వెళ్ళిపోయిన తర్వాత ధనంజయ్ కనకారావుతో అన్నాడు.

''ఈమధ్య, వంద అయిదు వందల నోట్లే కాదు- ఏభై నోట్లు కూడా నకిలీవి వచ్చేస్తున్నాయి! ఎందుకైనా మంచిది, ఈ కొత్త వంద రూపాయల నోట్ల కట్టని మా బ్రాంచి మేనేజరుగారికి చూపించి ఆయన అభిప్రాయం కూడా తీసుకో. కాని ఇవి మట్టుకు ఖచ్చితంగా జాలీ నోట్లే.''

''నీ అనుభవం మీద నాకు నమ్మకం లేకకాదు. అసలు బ్రాంచి మేనేజరు దృష్టిలోకి ఈ విషయం తీసుకువెళ్ళడం అవసరమా?'' కనకారావుపైన తిరుగుతున్న సీలింగ్ ఫాన్ వైపు చూస్తూ అన్నాడు.

ఆ ఫాన్ గాలి తగిలిన ధనంజయ్ ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు. తన చెల్లి పెళ్ళి విషయంలో కొంత ధనసహాయం చేసిన కనకారావు ఇప్పుడు కాళ్ళకు బంధం వేస్తున్నాడు.

కనకారావే మళ్ళీ లోగొంతులో అన్నాడు. ''వీటిని మార్చడం నీకు వేళ్ళమీద పని!''

''అన్నినోట్లూ ఒక్కరికే అంటకట్టడం వీలుకాని పని. కస్టమర్లకి ఒకటీ, రెండూ ఇచ్చుకొంటూ పోవాలి. సమయమూ పడ్తుంది, రిస్కూ ఎక్కువే! నా ఉద్యోగం ఊడ్డానికి క్షణం పట్టదు''అన్నాడు ధనంజయ్.

''నువ్వీ పదివేలూ మార్చి నాకిచ్చావంటే, నువ్వు నాకివ్వవలసిన సొమ్ములోంచి అయిదువేలు చెల్లుకొట్టేస్తాను. ఆలోచించుకో,'' అన్నాడు కనకారావు ఎరవేస్తూ.

ధనంజయ్‌లో ఆశ తలెత్తి అతన్ని కనకారావు గాలానికి తగుల్కొనేటట్లు చేసింది. బల్లమీదనున్న నోట్లకట్టని తీసుకొని మౌనంగా బయటకు దారితీశాడు. మర్నాడుదయం ధనంజయ్ దాన్ని తన సంచీలో ఉంచుకొని బాంక్‌కి వెళ్ళాడు.

మూడూ, నాలుగు వేలు తీసుకొనే వారికి ఒకటీ, అరా లౌక్యంగా ఇచ్చే పథకం వేసుకొన్నాడు. ధైర్యం చాలక ఓ అరడజను మంది మొదటి కస్టమర్లని వదిలేశాడు. అంతలో రమ్యకృష్ణా రైసు మిల్లు ప్రొప్రయిటరు నరసింహం వచ్చి ఎనభైవేలకి చెక్కు రాసిచ్చి సొమ్ము తీసుకొన్నాడు. వచ్చిన స్వర్ణావకాశాన్ని ధనంజయ్ వదులుకోలేదు. నవనవలాడే ఎనిమిది నోట్ల కట్టల్ని అందించాడు. అందులో ఒకటిగా కనకారావిచ్చిన కట్టని వదిలించుకొన్నాడు. ఆ సాయంత్రం వీలు చూసుకొని వెళ్ళి కనకారావుకి పదివేలు మంచినోట్లు అందజేసి, తన బాకీలోంచి అయిదువేలు చెల్లుచేయించుకొన్నాడు.

రమ్యకృష్ణా రైసుమిల్లు ప్రొప్రయిటరు నరసింహం బాంక్‌లోంచి డబ్బు తీసుకొని, అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి వెళ్ళి ఎనభైవేలు కాష్ అందచేసి, తన పాస్‌బుక్ చూపించాడు. రమాపతి అనే ఓ ఆఫీసరు నరసింహాన్ని లోపలి గదిలోకి తీసుకుపోయి, ఆ నోట్లకట్టల మీద అవినీతి నిరోధకశాఖ వారి కొన్ని రహస్య రసాయనిక గుర్తులు వెయ్యసాగాడు. రమాపతి నకిలీ నోట్ల కట్టని సులువుగా గుర్తుపట్టకలిగాడు. నాటకంలో అంతర్నాటకం అనుకొంటూ నరసింహాన్ని నిలదీశాడు.

నరసింహం లబోదిబోమంటూ తనకానోట్లకట్ట బాంక్ వారిచ్చిందేనని, అయిన వారందరిపేరిటా ప్రమాణం చేసి చెప్పాడు. ''ఆ పార్టీకి మీరిచ్చే ఎనభైవేలలో ఈ కట్ట కనక వెళ్ళిందంటే, అతను మా వలలోపడ్డా ఈ వ్యవహారం మటుకు మీకూ, మీకూ తలబొప్పిగా మారుతుంది. అందుకని ఈ పదివేల సొమ్మూ మంచిదిగా ఉండాలి. పోయి పట్రండి''అని రమాపతి నరసింహాన్ని



''ఈ దొంగనోట్ల కట్టని మీరు బాంక్‌కి తిరిగి యివ్వ ప్రయత్నించినా ఒప్పుకోరు. తాము యివ్వలేదని మీమీదే నేరం మోపుతారు. మరి ఏంచేస్తారు?''

హెచ్చరించాడు.

నరసింహం దగ్గర్లోనే తన అకౌంట్ ఉన్న మరో బాంక్‌కి వెళ్ళి, ఎందుకైనా మంచిదనుకొంటూ ఓ ఇరవైవేలు తీసుకొని, పదివేలు రమాపతి కందించాడు. అతడు ఆ కట్టమీదా గుర్తులువేసి మొత్తం ఎనిమిది కట్టల్నీ నరసింహానికందించి చేయవల్సింది చెప్పాడు. అంతాచెప్పిన తర్వాత ఓ మాటన్నాడు. ''ఈ దొంగనోట్ల కట్టని మీరు బాంక్‌కి తిరిగి యివ్వ ప్రయత్నించినా ఒప్పుకోరు. తాము యివ్వలేదని మీమీదే నేరం మోపుతారు. మరి ఏంచేస్తారు?''

''ఈ లంచం వ్యవహారంకాదు కానీ మరో పదివేలు అదనంగా నష్టం!'' అన్నాడు నరసింహం బాధగా.

''లంచమిచ్చిన సొమ్ము కేసు విచారణ పూర్తి అవగానే మీకు ఎలాగూ తిరిగి వస్తుంది. అయితే ఆ డబ్బు త్వరగా తిరిగి రావాలన్నా, ఈ పదివేల నష్టాన్ని అయిదు వేలకి కుదించుకోవాలన్నా- అంతా మీ చేతిలో ఉంది!'' అన్నాడు రమాపతి ఆచితూచి.

నరసింహం రైసుమిల్లులో ధాన్యమే కాదు, పిండి కూడా ఆడతారు. అనుభవాన్ని పిండికొట్టి రాటుదేరిన మనిషి. జేబులోంచి పర్సుతీసి పది అయిదువందల నోట్లని అందించాడు. రమాపతి వాటిని జాగ్రత్తగా పరిశీలించి జేబులో వేసుకొని, ఓ ప్లాస్టిక్ సంచీలో ఎనిమిది కట్లనీ, విడిగా జాలీ నోట్ల కట్టనీ నరసింహానికి అందించాడు.

మర్నాడుదయం నరసింహం పోలీసు యినస్పెక్టరు కనకారావింటికి వెళ్ళాడు. పనికి ఆహారం పథకంలో నరసింహం కొందరు అవినీతి పరులైన నాయకులతో చేతులు కలిపాడు. ఒకానొక సందర్భంలో కనకారావు దృష్టలోపడి అతని చేతికి చిక్కాడు. బోర్డు పరీక్షల్లో తొంభైశాతం వచ్చినా ప్రవేశపరీక్షల్లో ఆశించిన స్థాయి రాకపోవడంతో కనకారావు కొడుక్కి ఫ్రీ సీటు లభించక, లక్షా ఏభైవేలు కట్టి సీటు కొనుక్కోవలసిన అవసరం వచ్చింది. ఆ సమయంలో నరసింహం కేసు కనకారావుకి ఓ వరంలా లభించింది. ఆ కేసుని మురగపెట్టి దారి మళ్ళించడానికి కనకారావు ఎనభైవేలు లంచం అడిగాడు. ముందుగానే పై అంతస్తుల్లో తన మిత్రుల అండదండలతో పరిష్కార మార్గం చూసుకొన్న నరసింహం, కనకారావు లాంటి చిన్నచిన్న ముల్లుల్ని తుడిచి పారేసే పథకంలో డబ్బుని అందించి బయటపడ్డాడు. కనకారావు ఆ డబ్బుని బీరువాలో దాస్తుండగా, బయట పొంచి వేచి ఉన్న అవినీతి నిరోధక శాఖాధికారులు లోపల ప్రవేశించారు. కనకారావు తెల్లబోయాడు.

నరసింహం ఆరోజు ఉల్లాసంగా ఉన్నాడు. ఓ ఎనిమిది వేల దాకా తన మిల్లులో పనిచేసే కార్మికుల, ఉద్యోగుల జీతాలలో ఒకటీ, అరా నోట్లు కలిపి చెల్లుబాటు చేసేశాడు. ఆ రాత్రి యిల్లాలు కాని ఓ ప్రియురాలు అందించిన స్వర్గసుఖాలకి ప్రతిఫలాన్ని తాగుడు మైకంలో రెట్టింపుచేసి రెండు వేలిచ్చాడు.

ఆ రెండు వేలకీ తన దగ్గరున్న మరో మూడువేలు కలిపి ఆమె బాంక్‌కి వెళ్ళింది తన సేవింగ్ అకౌంట్‌లో జమచెయ్యడానికి. కౌంటర్ వెనుకనున్న మనిషి ''మేడమ్, మీరిచ్చిన సొమ్ములో ఈ ఇరవై నోట్లు జాలీవి! అందుకని మీ అకౌంట్‌లో మూడువేలే జమచెయ్యగలం. ఈ జాలీ నోట్లు మీ ఎదుటనే చింపి పారేస్తాం. కాదూ, కూడదూ అంటే ఈ నోట్లని సీలు చేసి పోలీసుల కందించవలసి వస్తుంది. మీరు మా కస్టమరు కాబట్టి హితవుగా తీసుకోండి కాని మరోలా భావించవద్దు!''అన్నాడు.

ఆమెకి నరసింహం చేసిన దగా తెలిసి వచ్చింది. 'పరువాన్నమ్ముకొని పరువు పోగొట్టుకొన్నదాన్ని! నాకేమిటి?'' అనుకొంటూ మేనేజరు గదికి వెళ్ళి, ఆ నోట్లు తనకెలా వచ్చిందీ చెప్పి, అటు పైన స్వహస్తాలతో రాసి సంతకం చేసి బయటకు వచ్చింది. తీగలాగితే డొంకంతా కదిలింది. ఫలితంగా నరసింహం, రమాపతి, కనకారావు, ధనంజయ్‌లు ఎవరూ ఎవర్నీ వదలకుండా 'నేను మునిగితే నువ్వూ మునగాలి' అన్న పంథాలో ప్రవర్తించడంవల్ల పత్రికలకీ, ప్రజలకీ మహదానందం కలిగింది. రైసుమిల్లు జీతాలందుకొన్న చాలామందికి తలబొప్పికట్టడంతో వాళ్ళూ ముందుకు వచ్చి గళం విప్పారు. ఊరు ఊరంతా దొంగనోట్ల చలామణికి కేంద్రంగా దేశమంతా ఖ్యాతి చెందింది.

ఆ ఊరి పెద్దలు కొంతమంది తమ ఊరు అపఖ్యాతి చెందినందుకు చింతిస్తూ కారణాలు వెదకసాగారు. ''మన ఊరి వాస్తు బాగోలేదు. ఊరికి నైరుతిన చెరువుంది. చెరువుకి ఈశాన్యాన చెట్టు బరువుంది. అందుకనే ఈ గొడవంతా అక్కణ్ణుంచే మొదలైంది!'' అన్నారొకరు.

''అవును నిజమే! మన దేశం వాస్తూ అలానే ఉంది. ఉత్తర ఈశాన్యాలంతా హిమాలయాలూ, నైరుతిన మహాసముద్రమూ ఉంది! అందుకనే దేశ ఖ్యాతి కూడా మన ఊరి ఖ్యాతిలానే ఉండి, అవినీతి రాజ్యం ఏల్తోంది!'' అన్నారు మరొకరు.

★